క్లుప్తంగా

రాష్ట్ర స్థాయికి కస్తూర్బా విద్యార్థిని ఎంపిక

ఉండవెల్లి: మండలంలోని కలుగోట్ల కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని భారతి సీఎం కప్ క్రీడల పోటీలో భాగంగా నిర్వహించిన కబడ్డీ క్రీడలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ అరుణతార గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతుందని తెలిపారు.

31వరకు ఈకేవైసీకి గడువు



మానవపాడు: ఈ నెల 31వ తేదీ వరకు ఈకేవైసీ నమోదుకు అవకాశం ఉందని మండల కేంద్రంలోని పీఎం కిసాన్ లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి మణిప్రకాశ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. విగతా వివరాలకు వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ పనులు పూర్తి చేయాలి

రాజోళి: మండలంలోని పెద్ద తాండ్రపాడులో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న ప్రహరీ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ గోవిందు రావు అధికారులకు సూచించారు. గురువారం సర్పంచ్ శంకరమ్మతో కలిసి పాఠశాల పనులను పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, గత వారంలో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో చేపట్టిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ముండ్లదిన్నెలో నర్సరీలను పరిశీలించారు. మొక్కలకు రక్షణ ఏర్పాట్లపై ఆయన ఆరా తీశారు. ప్రతి మొక్కను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయిలో పని చేయాలని, నర్సరీలల్లో గడ్డిని, పిచ్చి మొక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ బీచుపల్లి పాల్గొన్నారు.

ఏఎన్ఎంకు గాయాలు

గట్టు: రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎంకు గాయాలైన ఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని మాచర్ల ఏఎన్ఎంగా పని చేస్తున్న జగదీశ్వరీ విధులు ముగించుకొని స్కూటీపై మండల కేంద్రానికి వెళ్తుండగా గంగిమాన్‌దొడ్డి సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు గద్వాలకు తరలించారు.

మేడికొండను మండలం చేయాలి

అలంపూర్: మేడికొండను కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని సాధన కమిటీ ఎమ్మెల్యే అబ్రహంను కోరారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో అయిజ మండలం మేడికొండ గ్రామాన్ని కొత్త మండలంగా ప్రకటించాలని కోరుతూ మేడికొండ మండల సాధన సమితి నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేడికొండ గ్రామస్తులు తెలంగాణ ఉద్యమకారుడు పులికల్ దేవన్న మృతికి మౌనం పాటించి సంతాపం తెలిపారు. 28 గ్రామ పంచాయతీలు ఉన్న అయిజ మండలంలో 15 గ్రామాలను కలిపి మేడికొండను మండలంగా ప్రకటించాలని కోరారు. కొత్త మండలంలో ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు 15 నుంచి 20 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మండల ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు అజయ్ కుమార్, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రాముడు, ఈశ్వర్, తిమ్మప్ప, దేవప్ప, రాముడు, శంకర్, రామకృష్ణ, భీమన్న, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

11 మంది బైండోవర్



కేటీదొడ్డి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మందిని గురువారం డిప్యూటీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వం నిషేధించిన నాటు సారా అమ్ముతున్నట్లు అందుకున్న సమాచారం మేరకు ముందస్తు చర్యలో భాగంగా బైండోవర్ కేసులు నమోదు చేసి సారా తయారీదారులను డిప్యూటీ తహసీల్దార్ శివ శంకర్ ఎదుట హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని ఎస్ఎల్‌వీ మద్యం దుకాణాన్ని తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధర కన్న అధికంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు సూచించారు.

సెగ్రిగేషన్ షెడ్ల వినియోగమేది?

- చెత్త రీసైక్లింగ్ ఊసేలేదు
- కనపడని కంపోస్టు ఎరువు తయారీ



షేకుపల్లిలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్డు.

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు గాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా గ్రామాల్లో సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పంట పొలాలకు అవసరమయ్యే కంపోస్ట్ ఎరువులను తయారీ చేయడం కోసం ప్రభుత్వం ప్రతి జీపీలో సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ కొందరి అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో ఆయా గ్రామాల నుంచి సేకరించిన చెత్తా చెదారాన్ని గ్రామాల శివార్లలో, రోడ్ల పక్కన ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. పంచాయతీల్లో అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించినా ప్రజలకు సక్రమంగా ఉపయోగపడటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీరు గారుతున్న ప్రభుత్వ లక్ష్యం..

పంచాయతీల్లో ప్రజలకు కావలసిన అన్ని సదుపాయాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి పంచాయతీకి రూ. 2.5 లక్షల నిధులను కేటాయించింది. దీని ద్వారా ప్రతి జీపీల్లో సెగ్రిగేషన్ షేడ్‌ను నిర్మించి గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను వేరుచేసి వానపాముల ద్వారా సేంద్రీయ ఎరువులను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ తయారు చేసిన కంపోస్టు ఎరువును గ్రామంలోని పంటలకు ఉపయోగించేందుకు రైతులకు విక్రయించాలని కార్యదర్శులకు తెలిపింది. దీని ద్వారా నిత్యం వచ్చే ఆదాయాన్ని ఆయా పంచాయతీలకు సమకూర్చుకునేలా కార్యచరణ రూపొందించింది. కానీ ప్రస్తుతం సగానికి పైగా జీపీల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వానపాములు సకాలంలో రాకపోవడంతో ఎరువు తయారీ పనులు నేటికి కూడా ప్రారంభం కాలేదు. దీనివల్ల ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యం నీరుగారుతూ.. ముందుకు సాగడం లేదని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతలేని కంపోస్టు ఎరువు..

పల్లెల అభివృద్ధిలో భాగంగా అలంపూర్ నియోజకవర్గంలోని 124 గ్రామ పంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్లు, డంపింగ్ యార్డుల నిర్మాణ పనులను పూర్తి స్థాయిలో చేపట్టారు. ఇందులో ఒక్కో సెగ్రిగేషన్ షెడ్‌కు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.5 లక్షలు మంజూరు చేసి పనులు పూర్తి చేశారు. కానీ అందులో ఎరువు తయారీ పనులను సక్రమంగా చేపట్టకపోవడంతో అవి అలంకార ప్రాయంగా మిగిలిపోయాయి. నియోజకవర్గంలోని 124 జీపీలకు కేవలం 88 షెడ్లలో మాత్రమే ప్రస్తుతం వానపాములను ఉపయోగించి గ్రామాల్లో సేకరించిన చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారుచేస్తున్నారు. వీటిలో కూడా ఎరువు సక్రమంగా తయారు కావడం లేదని రైతులు వాపోతున్నారు. అందులో తడి, పొడి చెత్తను వేయకుండా ఎక్కువ మొత్తంలో కేవలం మట్టిని మాత్రమే వేయడం వల్ల వానపాములు చనిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనివల్ల కంపోస్టు ఎరువు సక్రమంగా తయారు కాకపోవడం వల్ల రైతులు దానిపై మొగ్గు చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. మిగిలిన 36 షెడ్లలో ఇప్పటి వరకు వానపాములు అందుబాటులోకి రాలేదు. దీనివల్ల కంపోస్టు ఎరువును తయారు చేసే ఊసే లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.

ఆయా మండలాల వారీగా సెగ్రిగేషన్ షెడ్ వివరాలు ఇలా..

మండలం	జీపీలు	ఉపయోగంలో ఉన్నవి	నిరుపయోగమైనవి
ఇటిక్యాల	29	21	08
మానవపాడు	16	12	04
అలంపూర్	14	09	05
ఉండవెల్లి	16	13	03
రాజోలి	11	08	03
వడ్డేపల్లి	10	06	04
అయిజ	28	19	09



పెద్దదిన్నెలో తయారైన నాణ్యత లేని ఎరువు

వంద శాతం పనులు పూర్తి..



ఇటిక్యాల మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డులు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం పనులు వంద శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం 21 పంచాయతీలలో వానపాములను ఉపయోగించి తడి, పొడి చెత్తను ఉపయోగించి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. మిగిలిన 8 పంచాయతీలకు వానపాములు అందుబాటులో లేనందున ఎరువుల తయారీని చేపట్టలేదు. వానపాములు రాగానే వాటిలో కూడా కంపోస్టు ఎరువును తయారు చేయిస్తాం. షెడ్లలో తయారు చేసిన కంపోస్టు ఎరువును హరితహారం చెట్లకు వినియోగిస్తున్నాం. ఎరువు ఎక్కువగా తయారైన గ్రామాల్లో రైతులకు విక్రయించి నిధులను పంచాయతీలకు సమకూరుస్తాం.

– భాస్కర్, ఎంపీఓ, ఇటిక్యాల

ముమ్మరంగా 'కంటి వెలుగు'



సింధనూరులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

అలంపూర్: అయిజ మండలం సింధనూరులో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఎంపీటీసీ సుధారాణి ప్రారంభించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కంటి ఆపరేషన్‌తో పాటు పరీక్షలతో మందులు, అద్దాలు ఉచితంగా పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శి విష్ణు, నాయకులు రవి కుమార్ రెడ్డి, వీరేష్, ప్రాణేష్ స్వామి, నరసింహులు, దేవంద్ర, శేఖర్, ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో ఆరోరోజు గురువారం కంటివెలుగు శిబిరం కొనసాగింది. డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 159 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, ఐదుగురికి కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. ఏడుగురికి కంటి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో చంద్రన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, శారద, చిట్టెమ్మ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రధాని మోడీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని ఉదండాపురంలో మండలాధ్యక్షుడు జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలను, నిరుద్యోగులను మాయమాటలతో మభ్యపెడుతున్నారన్నారు. పల్లెలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు తప్పా బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమి లేదన్నారు. 35 లక్షల మంది నిరుద్యోగులకు రూ.3,016 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి నేటికి నెరవేర్చలేదన్నారు. ఈ నెల 30 నాటికి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తవుతుందని ఈ సందర్భంగా జన సంపర్క్ అభియాన్‌లో భాగంగా మే 30 నుంచి జూన్ 30 వరకు కేంద్ర పథకాల గురించి గ్రామాల్లో ప్రజలకు వివరించాలని బీజేపీ శ్రేణులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యుడు తిమ్మారెడ్డి, నాయకులు నర్సింహులు, నరసింహశెట్టి, అశోక్, లక్ష్మణ్‌గౌడ్, కార్యకర్తలు, ఉన్నారు.

పేదలకు అండగా కేంద్ర పథకాలు

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నా.. అవి కేంద్రానివని తెలియడం లేదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆయన గురువారం శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈ నెల 30 వరకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పరిపాలన తొమ్మిదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో మూడు సమావేశాలు శక్తి కేంద్రంలో ఒకటి, బూత్ స్థాయిలో మూడు కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ నెల 20నుంచి 30 వరకు గ్రామాల్లో కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, విడుదలయిన నిధుల గురించి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కేంద్రాల్లో తేమ శాతం వచ్చిన ధాన్యానికి ఎలాంటి తరుగు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని వారికి సూచించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రామన్న గారి వెంకటేశ్వర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు చరణ్, బాల్‌రాజు, రాములు, విష్ణువర్ధన్, జానయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



మదనాపురం: మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన అభయాంజనేయ స్వామి విగ్రహ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వేద పండితులు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. హోమం, పారాయణం భక్తిశ్రద్ధలతో చేశారు. స్వామి వారికి గజమాల వేసి పాలాభిషేకం, జలాభిషేకం చేపట్టారు. దుర్గాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. మహిళలు యువకులు గ్రామస్తులు రాజకీయ ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.

గాలివాన బీభత్సం



ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగిపడిన స్తంభం

అలంపూర్: అయిజ మండలంలోని సంకాపురంలో బుధవారం అర్ధరాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. గాలివానకు విద్యుత్ స్తంభాలతోపాటు భారీ వృక్షాలు, ట్రాన్స్‌ఫార్మర్ కూలాయి. నాలుగు విద్యుత్ స్తంభాలతోపాటు, నాలుగు వృక్షాలు నేలకొరిగాయి. రైతుల వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోవడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అర్ధరాత్రి సమయంలో పొలాల్లో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. గురువారం విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి స్తంభాలు కొత్తవి ఏర్పాటు చేసి తీగలు లాగే పనిలో నిమగ్నమయ్యారు.

ప్రైవేట్ పనులకు పంచాయతీ ట్రాక్టర్ వినియోగం



గద్వాల క్రైం: మండలంలోని సంగాల పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్ ద్వారా కొన్ని రోజులుగా సర్పంచ్ అక్రమంగా మట్టిని తరలిస్తుడు. ప్రైవేట్ పనులకు గ్రామ పంచాయితీ ట్రాక్టర్‌ను వినియోగించడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పనులకు వినియోగించాల్సిన ట్రాక్టర్‌ను యథేచ్ఛగా వ్యాపారానికి వాడుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయం పై జిల్లా పంచాయితీ అధికారి శ్యాంను వివరణ కోరగా ప్రభుత్వ ట్రాక్టర్‌ను గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులకు మాత్రమే వినియోగించాలని పేర్కొన్నారు. సొంత పనులకు వినియోగిస్తే శాఖ పరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. నిబంధనలు ఉల్లంఘించిన సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం.

సమస్యలు పట్టించుకోండి

అమరచింత: పట్టణంలోని నాల్గో వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విఫలమయ్యారని సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు అబ్రహం, భాస్కర్ అన్నారు. రెండు నెలల కిందట సీసీ రహదారి పనుల కోసం రోడ్డును చదును చేసి వదిలేశారని, ఇప్పటి వరకు వాటిని పట్టించుకోనే వారే కరువయ్యారని వాపోయారు. మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు ఇప్పటికైనా నాల్గో వార్డులో నెలకొన్న సమస్యలు, అసంపూర్తి సీసీ రహదారులను వెంటనే నిర్మించి వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలని కోరారు. శ్యాసుందర్, కుతుబ్, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వీఎం అబ్రహం అన్నారు. గురువారం ఇటిక్యాల మండలంలోని శనగపల్లి నుంచి జక్కిరెడ్డిపల్లి వరకు రూ.కోటి 60 లక్షల వ్యయంతో 2.3 కిలోమీటర్ల వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బీటీ, సీసీ రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. పల్లెల్లో ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆయా గ్రామాల నాయకులు, గ్రామస్తులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రవి, తిరుపతిరెడ్డి, పంచాయతీ రాజ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, తదితరులు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

శాంతినగర్: వడ్డేపల్లి ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే అబ్రహం గురువారం ప్రారంభించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కోట్ల గోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వింటాల్ వరిధాన్యం రూ.2060 లకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గుడ్డెందొడ్డిని సందర్శించిన ఎన్ఐఆర్‌డీ అధికారులు



గుడ్డెందొడ్డిలో సందర్శిస్తున్న ప్రొఫెసర్ రాజేశ్వర్



వెంకటాపురంలో ఎన్ఐఆర్‌డీ బృందం

ధరూరు: మండలంలోని గుడ్డెందొడ్డి గ్రామాన్ని గురువారం నేషనల్ ఇనిస్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ) అధికారులు సందర్శించారు. ప్రొఫెసర్ రాజేశ్వర్ నేతృత్వంలో గ్రామంలో పర్యటించారు. ప్రధానంగా బృహత్ పల్లె ప్రకృతి వనం, క్రిమిటోరియా, వాటర్, నర్సరీ మొక్కలు, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు తదితర వాటితో పాటు ఇతర పనులను పరిశీలించారు. గ్రామస్తుల ఇళ్ల ముందు నిలిచిన మురుగు నీటిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా.. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల పని తీరు తదితర వివరాలు తెలుసుకున్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అందరి సహకారంతోనే గ్రామం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. వారి వెంట ఎంపీడీఓ ఎండీ జబ్బార్ ఉన్నారు.

కేటీదొడ్డి: గ్రామ అభివృద్ధిలో పంచాయతీ అధికారులు, సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని ఎన్ఐఆర్‌డీ బృందం సభ్యుడు ప్రొఫెసర్ రాజేశ్వర్ అన్నారు. గురువారం మండలంలోని వెంకటాపురం, ఈర్లబండ, గ్రామాల్లో ఎన్ఐఆర్‌డీ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని పల్లె ప్రగతిలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు రైతు వేదిక, నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాలు, మామిడి తోటలను పరిశీలించారు. వారి వెంట ఏపీడీ నాగేంద్రం, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్, ఎంపీఓ సయ్యద్‌ఖాన్, ఏపీఓ కుమార్, సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు గోపి, తదితరులు ఉన్నారు.

సూచిక బోర్డులను ఏర్పాటు చేయండి



పెద్దొడ్డి-మల్దకల్ గ్రామాల మధ్య ప్రమాదకర మలుపు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. మలుపుల వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్ల మలుపుల వద్ద సూచికబోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత



నర్సరీను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ

ఉండవెల్లి: మొక్కల పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ ముసాయిదా బేగం అన్నారు. గురువారం మండలంలోని బొంకూరులో గ్రామ పంచాయతీ, నర్సరీ, ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. నర్సరీలో విత్తనాలు పెరగని బ్యాగులను ఖాళీగా లేకుండా వాటిలో మరో రకమైన విత్తనాలను వేసి పెంచాలని అధికారులకు సూచించారు. 100 శాతం మొక్కలను పెంచాలని ఆదేశించారు. ఉపాది హామీ పనులలో కూలీలకు అవగాహన కల్పించి కూలి ధర పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంటుకు సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి హామీ పనులు



అమరవాయిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. జాబ్ కార్డులు ఉన్న కూలీలందరికి ఉపాధి కల్పించడంతో పనులు ఊపందుకున్నాయి. దీంతో గ్రామాలలో ఉన్న కూలీలు పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ సందర్భంగా గురువారం ఎంపీడీఓ కృష్ణయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు ఉపాధిహామీ పనులను పరిశీలించి మాట్లాడారు. ఎండాలు ఎక్కువగా ఉండడంతో కూలీలు ఉదయం, సాయంత్రం పనులు చేపట్టాలని సూచించారు. పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు ఉమేరా, ఇబ్రహీం, నాగరాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వట్టిపోతున్న సోర్స్‌బోర్లు

- తాగునీటికి తప్పని తిప్పలు
- మిషన్ భగీరథ నీటి కోసం ప్రజల పడిగాపులు



బీసీ కాలనీలో వట్టిపోయిన బోర్ మోటార్‌ను బయటకు తీస్తున్న మున్సిపల్ సిబ్బంది



వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న అధికారులు

అమరచింత: పట్టణంలోని ప్రజలకు నిత్యం తాగునీటిని అందిస్తున్న 16 సోర్స్‌బోర్లు ప్రస్తుతం వట్టిపోతున్నాయి. సరిపడా తాగునీటిని అందించలేకపోవడంతో ఆయా వార్డుల్లోని ప్రజలు తాగునీటి కోసం వాటర్ ట్యాంకర్ రాక కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు దాపరించాయి. పట్టణంలోని పది వార్డుల్లో సుమారు మూడు వేల కుటుంబాల్లో 18 వేల జనాభా ఉంది. అమరచింత పంచాయతీగా ఉన్నప్పుడు తాగునీటి కోసం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బోర్లను ఏర్పాటు చేసుకోని వాటి ద్వారా వచ్చే నీటిని ఓవర్‌హెడ్ ట్యాంకులకు అందిస్తూ.. కాలనీలకు నీటిని సరఫరా చేసేవారు. మరమ్మతు, క్రషింగ్‌ల కోసం పంచాయతీ నిధులను వెచ్చించి ఇబ్బందులు కల్గకుండా ప్రజలకు నిత్యం తాగునీటిని అందించేవారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని ప్రభుత్వం అందిస్తుండటంతో బోర్ల మరమ్మతు, క్రషింగ్‌లకు వీలు లేకుండా పోయింది.

ఎండిపోయిన 4 బోర్లు

పట్టణంలోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన 16 సోర్స్ బోర్లు అనుకున్న విధంగా రోజువారి నీటిని అందించలేక పోతున్నాయి. వీటిలో నాలుగు బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో బీసీ కాలనీలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మిగిలిన 12బోర్లు సైతం క్రషింగ్ చేపడితే కాని నీటిని అందించలేమని మున్సిపల్ వాటర్‌మ్యాన్‌లు అంటున్నారు. మిషన్ భగీరథ ద్వారా ఆరు ఓవర్ హెడ్ ట్యాంక్‌లు ఉన్నా.. ప్రజలకు వేసవిలో తాగునీటిని అందించలేకపోతున్నాయి. అధికారులు స్పందించి తాగునీటి ఎద్దడి తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.